
తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
28-03-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 61
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

## ఆ బాడీ ఏంట్రా బాబు, అస్సలు ఊహించ లేదు..

- ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు పెద్ది
- చరణ్ పుట్టినరోజు సందర్భంగా పెద్ది గ్లింప్స్
- ఇది అసలైన బర్త్‌డే ట్రీట్ చరణ్ అన్న

8



# అంగరంగ వైభవం..
# సీతారాముల కల్యాణం





పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు
లక్షలాదిగా విచ్చేసిన భక్తులు
కిక్కిరిసిన మిథిలా స్టేడియం
రేపు మహా పట్టాభిషేకం

దక్షిణ అయోధ్యగా పిలుచుకునే భద్రాచలంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చారు. స్వస్తిశ్రీ చాంద్రనామ పరాభవ నామ సంవత్సర చైత్రశుద్ధ నవమి అభిజిత్ లగ్నమందు లక్షలాదిగా తరలి వచ్చిన భక్తుల జైశ్రీరాం నినాదాలతో కల్యాణ మండపం మిథిలా స్టేడియం మారుమోగింది.

2





2

### గొల్లపల్లి కల్యాణోత్సవంలో పాల్గొన్న కేటీఆర్



### లోక్ భవన్‌లో శ్రీరామనవమి ఉత్సవం

2

- శోభా యాత్రను ప్రారంభించిన గవర్నర్



### తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరిక

2

- మూడు రోజుల్లో ఈదురుగాలులతో వర్షాలు



3

### జన్ విశ్వాస్ సవరణ బిల్లుతో ప్రమాదం

- వ్యతిరేకించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య

### ఎల్‌బి స్టేడియంలో శాసనసభ్యుల క్రీడోత్సవాలు

2

## రూ.351 కోట్లతో భద్రాద్రి
# ఆలయ విస్తరణ పనులు



### తొలి దశ పనులకు సీఎం శంకుస్థాపన

**భద్రాచలం, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

భద్రాచలం రామాలయం అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.586 కోట్లు ప్రకటించారు. అందులో తొలి విడతగా రూ.351 కోట్లతో విస్తరణ పనులు ప్రారంభించేందుకు శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా భద్రాచలానికి వచ్చిన సీఎం భూమి పూజ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి దంపతులు తిరుకళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

మిథిలా స్టేడియంలో నిర్వహించిన శ్రీ సీతా రామచంద్రస్వామి తిరుకళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయాన్ని సర్వాంగ

మిగతా 3వ పేజీలో..

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై
# సీఎంలతో ప్రధాని సమీక్ష



3

## కరీంనగర్ ఆర్బీఎల్ బ్యాంకులో
# రూ.137 కోట్ల కుంభకోణం

- బ్రాంచ్ మేనేజర్ సహా 13 మంది అరెస్టు

2






## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

### గణాంకాలు విడుదల చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

రాష్ట్రంలో ఇంధన సరఫరాపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా గణాంకాలను

మిగతా 3వ పేజీలో..



# ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

ఏప్రిల్ 25న పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటిస్తా
శ్రీరామ నవమి అయినందున ప్రకటన చేస్తున్నా
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

3

## పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

- పర్యవేక్షణకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ
- పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం
- పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 తగ్గిస్తూ ఆదేశం

3



## గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో
# భారీగా చమురు తెట్టు

- సముద్ర జీవులపై తీవ్ర ప్రభావం

3



## ఎల్‌బి స్టేడియంలో శాసనసభ్యుల క్రీడోత్సవాలు

**హైదరాబాద్, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

ఎల్‌బి స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. 28 నుంచి ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ 2026 ఏర్పాట్లను స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవితో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన పెంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు 14 సంవత్సరాల తరువాత తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో అన్ని పార్టీల శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు పాల్గొనడం ఆనందకరమని పేర్కొన్నారు.

ఈ క్రీడోత్సవాల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్ బాల్, క్రికెట్, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌తోపాటు పలు వినోదాత్మక క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలను వీక్షించేందుకు అందరికీ ఉచిత ప్రవేశం కల్పించామని, అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.




## కరీంనగర్ ఆర్బీఎల్ బ్యాంకులో రూ.137 కోట్ల కుంభకోణం

- **బ్రాంచ్ మేనేజర్ సహా 13 మంది అరెస్టు**

**కరీంనగర్, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

కరీంనగర్‌లోని ఆర్బీఎల్ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగుచూసింది. నకిలీ బ్యాంకు ఖాతాలు తెరిచి మ్యూల్ ఖాతాల ద్వారా డబ్బులు మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. సైబర్ క్రైమ్, హవాలా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి బ్రాంచ్ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మొత్తం 7 మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో తేలింది. చైనా వ్యక్తులతో కలిసి బండారి సాయిరామ్ అనే వ్యక్తి మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రతి లావాదేవీపై సాయిరామ్ 2 శాతం కమీషన్ తీసుకున్నట్లు వెల్లడించారు. మొత్తం 8 కేసుల్లో 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా నిందితులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. అమాయకులు, చదువుకున్నవారు, నిరక్షరాస్యులను వాడుకుని ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. మధ్యవర్తులు డబ్బుల ఆశతో కొందరిని ఖాతాలు ఇవ్వడానికి ప్రోత్సహించినట్లు తెలిపారు. ఇద్దరు ఆర్బీఎల్ బ్యాంకు ఉద్యోగులపై విచారణ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ మోసగాళ్లు అమాయకులను పావులుగా వాడుకుంటూ మ్యూల్ ఖాతాల ద్వారా అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కమీషన్ ఆశతో PAN, Aadhaar కార్డులను ఇతరులకు ఇవ్వవద్దని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల అకౌంట్ల ద్వారా లావాదేవీలు జరిపితే కేసుల్లో చిక్కుకునే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.



## తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరిక

- **మూడు రోజుల్లో ఈదురుగాలులతో వర్షాలు**

**హైదరాబాద్, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

వేసవి భానుడి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఇటీవల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న మూడు రోజులపాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణపై ప్రస్తుతం వాతావరణ ద్రోణి ప్రభావం కనిపిస్తోందని అధికారులు వివరించారు. మరఠ్వాడా నుంచి కర్ణాటక తీరం వరకు సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

వర్షం సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే ఈ ఉపశమనం తాత్కాలికమేనని, వచ్చే వారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశముందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికం కావచ్చని అధికారులు తెలిపారు.

# అంగరంగ వైభవం.. సీతారాముల కల్యాణం









- **పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు**
- **లక్షలాదిగా విచ్చేసిన భక్తులు**
- **కిక్కిరిసిన మిథిలా స్టేడియం**
- **రేపు మహా పట్టాభిషేకం**

**భద్రాచలం, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

దక్షిణ అయోధ్యగా పిలుచుకునే భద్రాచలంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చారు. స్వస్తిశ్రీ చాంద్రనామ పరాభవ నామ సంవత్సర చైత్రశుద్ధ నవమి అభిజిత్ లగ్నమందు లక్షలాదిగా తరలి వచ్చిన భక్తుల జైశ్రీరాం నినాదాలతో కల్యాణ మండపం మిథిలా స్టేడియం మారుమోగింది. ఉదయం 10 గంటల నుండి శ్రీ పాంచరాత్రాగమ విధానంలో శ్రీ సీతారామచంద్ర కల్యాణ మహోత్సవం మిథిలా స్టేడియం (కల్యాణ మండపం)లో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రధాన ఆలయం నుండి ఉత్సవ మూర్తులు సీతారామ, లక్ష్మణ, హనుమంతులను మంగళవాయిద్యాలతో వేద మంత్రాలతో ప్రత్యేక పల్లకిపై ఉదయం 10 గంటలకు కల్యాణం జరిగే మండపానికి తోడ్కొని వచ్చి ధగధగాయమానంగా వెలుగొందే వెండి సింహాసనంపై ఆశీనులను చేశారు. తొలుత మండపాన్ని శుద్ధి చేసి మంజునకి ప్రథమం అను మంత్రం జపిస్తూ యధాసుదర్శరాజా సంవత్సర్గం శ్రీయుద్యా ఆయుష్మే అనే సంకల్పంతో స్వామివారికి ఎదురుగా సీతమ్మ వారిని కూర్చుండబెట్టి కన్యావరణాలు జరిపించి మోక్షబంధనం ప్రతిసారబంధం, ద్వితీయ, సువర్ణ యజ్ఞోపవీత ధారణలు జరిపించారు. అనంతరం ఆశీర్వచనం పాదప్రక్షాళనం, పుష్పోదక స్నవనం పూర్తి అయిన తర్వాత 10.20 నిమిషాలకు స్వామివారికి వరపూజ నిర్వహించారు. అనంతరం భక్త రామదాసు చేయించిన ఆభరణాలు పచ్చలపతకం, శ్రీరామమాడ, చింతాకుపతకం అమ్మవారికి అలంకరించి, శ్రీరంగనాథుడు పంపిన పట్టువస్త్రాలను అమ్మవారికి, స్వామివారికి అలంకరించారు. అత్తరు, పన్నీరు, దివ్యసుగంధ ద్రవ్యాలు, మంచిగంధం, అగరు, జవ్వారి, కస్తూరి, ఘనసారములతో తయారు చేసిన సుగంధ మాలికలను స్వామివారికి అలంకరించారు. అలాగే తేనె, పెరుగు కలిపిన పంచామృతాలను స్వామివారికి నివేదించిన పిమ్మట నూతన వస్త్రాలంకరణ చేశారు. విశ్వసృష్టిని దానితోనున్న కాలమును సంకల్పం చెప్పి 11.40 గంటలకు కన్యాదానం కరిష్యే అంటూ 12 గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామివారు అమ్మవారి శిరస్సుపై జీలకర్రబెల్లం మిశ్రమాన్ని ఉంచారు. 12.30 గంటలకు కల్యాణం తంతునాభద్రాద్రి అంటూ మాంగల్య ధారణ జరిపించారు. అనంతరం భక్తరామదాసు 17వ శతాబ్దంలో చేయించిన మంగళసూత్రధారణ జరిగింది. మూడు సూత్రాల విశిష్టతను వేదపండితులు భక్త జనావళికి వివరించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు వచ్చిన లక్షలాదిమంది సీతారామచంద్రమూర్తులకు జయజయధ్వానాలు పలికారు. కల్యాణాన్ని ప్రతీ ఒక్కరు తిలకించేందుకు గ్యాలరీల్లో క్లోజ్డ్ సర్క్యూట్ టీవీలు ఏర్పాటు చేశారు. ఆధ్వర్యులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ప్రధానార్చకుడు అమరవాది విజయరాఘవన్, ఆచార్యులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, కోటి శ్రీమన్నారాయణాచార్యులు కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, ఎండోమెంట్ కమిషనర్ హనుమంత రావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎంపీ పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి.రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యాచందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.

**టీటీడీ నుంచి పట్టువస్త్రాలు**

భద్రాచలం శ్రీ సీతారాముల కళ్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆనవాయితీగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయం నుండి ధ్రువమూర్తులను కళ్యాణ మండపం వద్దకు తోడ్కొని వస్తుండగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు వేదపండితులకు అందచేశారు.

**రేపు పట్టాభిషేకం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారికి శనివారం మహా పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరు కానున్నారు.







## లోక్ భవన్‌లో శ్రీరామనవమి ఉత్సవం

- **శోభా యాత్రను ప్రారంభించిన గవర్నర్**

**హైదరాబాద్, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

శ్రీరామనవమి సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లాతో కలిసి లోక్ భవన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. లోక్ భవన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పా



ల్గొన్న అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రను గవర్నర్ ప్రారంభించారు.

## గొల్లపల్లి కల్యాణోత్సవంలో పాల్గొన్న కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పండితులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన సందర్భంగా కేటీఆర్‌కు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించారు.



## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

**మొదటిపేజీ తరువాయి**

విడుదల చేసింది. ఈ నెల 27 నాటి వివరాల ప్రకారం రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అధికంగా అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. సాధారణంగా అవసరమయ్యే పరిమాణంతో పోలిస్తే మార్చి 26న సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా నమోదైనట్లు తెలిపింది.
రాష్ట్రంలో రోజువారీ సగటు పెట్రోల్ అవసరం 5,883 కిలో లీటర్లు కాగా, మార్చి 26న 16,609 కిలో లీటర్ల పెట్రోల్ సరఫరా చేసినట్లు పేర్కొంది. ఇదే విధంగా డీజిల్ రోజువారీ సగటు అవసరం 7,348 కిలో లీటర్లు ఉండగా, 19,580 కిలో లీటర్ల డీజిల్ సరఫరా చేసినట్లు వివరించింది. ఈ లెక్కల ప్రకారం సాధారణ డిమాండ్ కంటే పెట్రోల్ 182 శాతం, డీజిల్ 167 శాతం అధికంగా అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది.
మొత్తంగా రాష్ట్రానికి రోజువారీ అవసరమైన ఇంధనం 13,231 కిలో లీటర్లు కాగా, ప్రస్తుతం 36,189 కిలో లీటర్లు సరఫరా అవుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, ప్రజలు వదంతులను నమ్మవద్దని సూచించింది. ఇంధన సరఫరాలో అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది.

## రూ.351 కోట్లతో భద్రాద్రి ఆలయ విస్తరణ పనులు



**మొదటిపేజీ తరువాయి**

సుందరంగా అలంకరించగా తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.
భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తాగునీరు, అన్నప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై సీఎంలతో ప్రధాని సమీక్ష

**న్యూఢిల్లీ, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు ఐదో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో దేశంలో ఇంధన, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి మధ్య దేశీయ ఇంధన భద్రతను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రజల అవసరాలను తీర్చడంలో టీమ్ ఇండియాగా సమన్వయంతో పనిచేయాలని ప్రధాని సూచించారు. ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని పేర్కొంటూ, కొవిడ్ 19 తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. రాష్ట్రాలు ఇచ్చే సూచనల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని కేంద్రం వెల్లడించింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల బదులు ప్రధాన కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అనధికారిక మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్ పురి సభ్యులుగా ఉన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలో ముగిసే సూచనలు కనిపించకపోవడంతో అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పౌరుల జీవితాలపై పడే ప్రభావాలను పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకునేందుకు ఈ మంత్రుల బృందం పనిచేయనుంది.
అంతకుముందు మార్చి 25న పశ్చిమాసియా పరిస్థితిపై రాజకీయ పార్టీల నాయకులకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. పార్లమెంటు ఉభయ సభల్లో కూడా ప్రధాని పశ్చిమాసియా సంక్షోభంపై ప్రకటన చేశారు.

## కూలిన వేదిక.. ఎమ్మెల్యే వేములకు తప్పిన ప్రమాదం

**నల్లగొండ, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తృటిలో ప్రమాదం తప్పింది. కేతేపల్లి మండలం బండపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదిక అకస్మాత్తుగా కుప్పకూలింది.
ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు వేడుకల్లో పాల్గొని వెళ్లిన కొద్దిసేపటికే ఈ ఘటన జరిగింది. సీతారాముల కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేదిక కూలడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ అపశృతి జరిగిందంటూ విమర్శలు వ్యక్తమయ్యాయి.

# జన్ విశ్వాస్ సవరణ బిల్లుతో ప్రమాదం

- **వ్యతిరేకించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య**

**న్యూఢిల్లీ, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**



జన్ విశ్వాస్ (సవరణ) బిల్లును లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వ్యతిరేకించారు. వ్యాపార సౌలభ్యం పేరుతో తీసుకొస్తున్న ఈ బిల్లులో పలు కీలక నిబంధనలను డీక్రిమినలైజ్ చేయడం వల్ల నియంత్రణ వ్యవస్థ బలహీనపడే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ అమలు విధానాలు బలంగా లేకుండా చట్టపరమైన శిక్షలను తగ్గించడం వల్ల ఉల్లంఘనలు పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం, పర్యావరణం, కార్మిక హక్కుల వంటి కీలక రంగాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యాపారాలకు అనుకూలత కల్పించడమే కాకుండా ప్రజల హక్కులు, భద్రతను కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి కీలక సవరణలపై విస్తృత చర్చ జరిపి, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కావ్య డిమాండ్ చేశారు.

**పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి**

పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని ఎంపీ డాక్టర్ కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఈ రసాయనం వల్ల పర్యావరణం, మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాక భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల హాస్పిటల్‌కి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు, వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని, ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

## పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

- **పర్యవేక్షణకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ**
- **పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం**
- **పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 తగ్గిస్తూ ఆదేశం**

**న్యూఢిల్లీ, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడాయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈమేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరల పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటి వల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. 7 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

## నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం

- **గడ్డి మందు ప్రభావంతో సోదరుడు మృతి**
- **పారాక్వాట్‌ను నిషేధించాలని రామకృష్ణ బహిరంగ వినతి**

**హైదరాబాద్,మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

ప్రముఖ నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది.
ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్‌లో ఎంత సులభంగా అందుబాటులో ఉన్నాయో వివరించాడు. ఈ విషప్రయోగం వల్ల సంభవించే మరణాల సంఖ్యను చూసి వైద్యులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ అనేది చాలా శక్తివంతమైన రసాయనమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల ఇది శరీరంలోకి వెళ్ళిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ 'కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన వివరించారు.

## గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో భారీగా చమురు తెట్టు

- **సముద్ర జీవులపై తీవ్ర ప్రభావం**

**మెక్సికో, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ స్థాయిలో చమురు తెట్టు ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. చమురు తెట్టు విస్తరించి సముద్ర జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు మెక్సికో అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలు సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు. కొన్ని నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని వెరాక్రూజ్ ప్రాంతంలో సహజంగా చమురు బయటకు వచ్చే పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో లీకైన చమురు నదుల ద్వారా సముద్రంలోకి చేరి సుమారు 200 కి.మీ తీరప్రాంతాన్ని దాటి మొత్తం 600 కి.మీ వరకు వ్యాపించింది. అదనంగా కాంపెచే బేలోని మరో సహజ చమురు ఊట కూడా నిరంతరం లీక్ అవుతూ కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. ఇంకా మూడు నెలల క్రితం సముద్రంలో ఒక చమురు నౌక మునిగిపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. ఈ ఘటనల వల్ల సముద్రంలోని చేపలు, సముద్ర తాబేళ్లు వంటి జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే, ప్రకృతి సంరక్షణ ప్రాంతాలు, బయోస్పియర్ రిజర్వులు, జాతీయ పార్కులు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రస్తుతం కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికారులు, సిబ్బంది శుభ్రపరిచే చర్యలు చేపడుతున్నారు.



# ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

- **ఏప్రిల్ 25న పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటిస్తా**
- **శ్రీరామ నవమి అయినందున ప్రకటన చేస్తున్నా**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**నిజామాబాద్, మార్చి 27, సిరి న్యూస్‌టుడే:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు తమ పార్టీలో మంచి స్థానం ఉంటుందని, ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు.. ఇపుడు తెలంగాణ ఆడబిడ్డగా తాను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారుగా అని అన్నారు. దీంతో నూతన పార్టీపై కొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు కవిత తెరదించారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలన్నారు. నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది అని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. తాము ఎవ్వరికీ 'బి' పార్టీ కాము. తమది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తామన్నారు. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలన్నారు. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జిల జాప్యానికి తానే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే దిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా అని కవిత స్పష్టం చేశారు.



# శ్రీరామనవమి ఉత్సవాలలో పాల్గొన్న కూన శ్రీనివాస్ గౌడ్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి సిరి న్యూస్ మార్చ్ 27**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజుల రామారాం, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ సర్కిల్లో జరిగిన శ్రీరామనవమి సందర్భంగా పలు ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణం మరియు శ్రీరాముని ఉత్సవాలలో ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా ★కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ హాజరై ఆ సీతారాముల కళ్యాణం తిలకించి స్వామివారి లను దర్శించుకున్నారు..ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడని అదేవిధంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు...అనంతరం ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు...ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రేజింతల్ సర్పంచ్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం.



**సదాశివపేట. మార్చి 27. (సిరి న్యూస్)**

సదాశివపేట హనుమాన్ నగర్ కాలనీలో రేజింతల్ సర్పంచ్ గడీల ఆశి రెడ్డి గీత, అనిల్ కుమార్ మౌనిక దంపతులచే శ్రీ సీతారాముల కళ్యాణం ఆశిరెడ్డి గృహంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తలంబ్రాలు పంచడం జరిగింది. పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాద వితరణ

# శ్రీరామ నవమి సందర్భంగా

- భాజా భజంత్రీలతో అంగరంగ వైభవంగా
- రఘు వంశ రామయ్య
- సుగుణాల సీతమ్మ తో
- శ్రీ కోదండ రామయ్య కళ్యాణ మహోత్సవం



**తూప్రాన్ మార్చ్ 27 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాలలో శుక్రవారం రోజు శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ వేడుకను కనుల పండుగగా జరుపుకున్నారు తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డు వెంకటాపూర్ గ్రామంలో మొదటిసారిగా శ్రీ ప్రసన్న అంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకను గ్రామస్తులు బాజా భజంత్రీలతో వైభవ పీఠంగా ఆంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణం పూల మాలలతో మామిడి తోరణాలతో అందంగా అలంకరించి కళ్యాణం కార్యక్రమం వరుడు రఘువంశ రామయ్య వధువు సుగుణాల సీతమ్మ శ్రీరామ చంద్రుని కళ్యాణ మహోత్సవం ఎదురుకోళ్ల కార్యక్రమం జిలకర బెల్లం మాంగల్య ధారణ ముత్యాల తలంబ్రాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం భారీ ఎత్తున చేశారు సాయంత్రం గ్రామ వీధుల్లో శవా కార్యక్రమం నిర్వహిస్తు శ్రీరామ జయరామ నామస్మరణలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు.తూప్రాన్ పట్టణంలోని రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ కొక్కొండ సమత కాశిరెడ్డి పూజారులు గ్రామ పెద్దలు ప్రజలు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

# కొంపల్లి,దూలపల్లిలో కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం





- ఎం.పి.ఈటెల రాజేందర్.
- భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఈటెల.
- జై శ్రీరామ్ నినాదాలతో మరు మ్రోగిన కొంపల్లి.
- జయభేరి కాలనిలో అతిభారీ సంఖ్యలో కళ్యాణంలో పాల్గొన్న భక్తులు.

**కొంపల్లి,మార్చ్-27(సిరి న్యూస్).**

శ్రీరామ నవమిని పురస్కరించుకొని కొంపల్లి ప్రాంతంలో పలు కాలనీలలో అక్కడి దేవాలయాల వద్ద జై శ్రీరామ్ నినాదాలతో కన్నుల పండుగగా స్వామి కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు.ముందుగా కాలనీల్లో యువకులు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ అందరిని ఆకట్టుకుంది.బ్యాంకు కాలనీ నుండి మొదలుకొని మెన్ రోడ్డు వరకు నిర్వహించిన ర్యాలీలో స్థానిక ఎం.పి.ఈటెల రాజేందర్ పాల్గొని ర్యాలీ నిర్వహించి సీతారాముల ఆశీస్సులు పొందారు.జయభేరి కాలనీలోసంజీవని హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన కళ్యాణంలో ఆలయకమిటీ సభ్యులు పలువురు కాలనీవాసులు దంపతులు కలిసి వేద మంత్రోచ్చారణ మేళ తాళాల మధ్య కళ్యాణం కొనసాగగా.దూలపల్లి లోని సీతారాముల ఆలయంలో ఆలయ కమిటీ పాలక వర్గం నిర్వహించినా కళ్యాణంలో గ్రామా ప్రజలు మరియు పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు.ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా అక్కడి పాలకవర్గం సభ్యులు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.భక్తుల అవసర నిమిత్తం మంచి నీరు.బెల్లంతో చేసిన పచ్చడి వంటిని భక్తులకు అందజేశారు.ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### శ్రీ భైరవ సహిత వీరాంజనేయ స్వామి ఆలయంలో కళ్యాణం

కొంపల్లి దులపల్లి చౌరస్తా వద్ద నూతనంగా ప్రతిష్టించిన శ్రీ భైరవ సహిత వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు.ప్రధాన దారిలో ఆలయం ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణిని తిలకించారు.భక్తులకోసం నిర్వహించ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.







# దుర్గ మాత మల్లేశ్వర ఆలయంలో ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి (సిరి న్యూస్) మార్చి 27**



దుండిగల్ మున్సిపల్ పరిధిలో బాదురుపల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో శ్రీరామనవమి వేడుకలు బాదురుపల్లి కాలనీలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నా దుండిగల్ ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ పద్మారావు హాజరై మాట్లాడుతూ గ్రీన్ హిల్స్ హౌసింగ్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక దుర్గ మల్లేశ్వర ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవం నిర్వహించి మాంగల్య వాయిద్యాల నడుమ వేద పండితుల మంత్రోచ్చారణాల సీతమ్మ తల్లి రామచంద్రస్వామి వివాహ వేడుకలు కన్నుల పండుగ సాగింది ఈ కార్యక్రమంలో భక్తులు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్నారు కల్యాణ మహోత్సవం లో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు అన్నదాన కార్యక్రమం లో కాలనీవాసులు భక్తులు వేల సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి ఈ వేడుకలను భక్తి భావాన్ని పెంపొందించడం కాకుండా కాలనీలో ప్రజల్లో ఐక్యతను మరింత బలపరిచిందని ఆలయ కమిటీ పేరుకుంది గ్రీనస్ కాలనీ దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో సీతారాములవారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సీతారాముల పల్లకిలో ఊరేగింపు స్వామివారి కల్యాణ మండపంలో నిర్వాహకులు గత రెండు రోజులుగా దేవాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేసి స్వామివారి కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు లేకుండా అభిజిత్ లగ్నం సీతారామయ్య శిరస్సుపై జిలకర బెల్లం తో పాటు సీతమ్మ మెడలో రామయ్య మాంగల్య తలంబ్రాలు అర్చకులు సాంప్రదాయ బద్దంగా ముత్యాల పందిరిలో భక్తులు ప్రజలు దంపతులు స్వామి వారికి పట్టువస్తులను సమర్పించి పీటలపై కూర్చొని సీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు గ్రీన్ హిల్స్ ప్రజలు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయాలకు అనుగుణంగా కులమతాలకు అతీతంగా చిన్న పెద్ద తేడా లేకుండా పార్టీలతో సంబంధం లేకుండా సీతారాముల కల్యాణ మహోత్సవం పండగ జరుపుకోవడం చాలా సంతోషకరమైన పండగని పేర్కొన్నారు గ్రీన్ హిల్స్ కాలనీలో ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని కలిసికట్టుగా నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అమర్నాథ్ ప్రధాన కార్యదర్శి దామోదర్ వైస్ ప్రెసిడెంట్ రఘుపతి రెడ్డి రాజు రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# గీతంలో డిజిటల్ సాన్నిహిత్యంపై ఆతిథ్య ఉపన్యాసం

- విద్యా పరిశోధనను విపులీకరించిన సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన"

**పటాన్ చెరు, మార్చి 27, (సిరి న్యూస్):**



హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని ఆంగ్లం, ఇతర భారత విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ సాన్నిహిత్యం: అంతర్-ఆసియాలో యువతులు అనే శీర్షిక పై శుక్రవారం ప్రత్యేక ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని గీతం లోని సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన అందించారు.ఆసియా నగరాలైన హాంగ్ కాంగ్, సింగపూర్, గ్వాంగ్ జౌ, బెంగళూరులలో ఆమె ఇటీవల జరిపిన బహుళ-ప్రాంతీయ పరిశోధన ఆధారంగా, నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలు, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల సంస్కృతులచే రూపుదిద్దుకున్న డిజిటల్ మాధ్యమం, యువతులు తమ గుర్తింపు, సంబంధాలు, ఆత్మీయతను నిర్వహించుకునే విధానాలను ఎలా మారుస్తుందో ప్రొఫెసర్ నిరంజన అన్వేషించారు. ప్రజా, వ్యక్తిగత జీవితాల మధ్య సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ, డిజిటల్ మాధ్యమాల ద్వారా సామాజికత ఆవిర్భావం, రోజు వారీ అనుభవంలో స్మార్ట్ ఫోన్ల పాత్ర కీలకంగా మారడం వంటి అంశాలను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు.ఈ ఉపన్యాసం భాషా పద్ధతులు, ఆన్ లైన్-ఆఫ్ లైన్ సంబంధాలు, డిజిటల్ సన్నిహిత ప్రవర్తన యొక్క కొత్త రూపాలను కూడా పరిశీలించింది. సమకాలీన సందర్భాలలో భావ ప్రసార సరళి, ప్లాట్ ఫారమ్ వినియోగం, ఎంపిక చేసుకున్న భాషా వాడకం అనేవి భావోద్వేగ వ్యక్తీకరణను, సామాజిక సంబంధాలను ఎలా పునర్నిర్మిస్తాయో వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ హెచ్ఎస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్లం, ఇతర భారత విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ వందన సమర్పణ తో ముగిసింది. వక్త గురించి:ప్రొఫెసర్ తేజస్విని నిరంజన గీతంలో డైరెక్టర్ గానే కాక, హాంకాంగ్ లోని లింగ్నాన్ విశ్వవిద్యాలయంలో అనుబంధ ప్రొఫెసర్. విశిష్ట పండితురాలైన ఆమె సంస్కృతి, సంగీతం, వలసానంతర అధ్యయనాలపై అనేక ప్రభావవంతమైన రచనలను చేయడమే గాక, సంపాదకత్వం వహించారు. ఆమె అమెరికన్ లిటరరీ ట్రాన్స్ లేటర్స్ అసోసియేషన్ వారిచే ఫిక్షన్ విభాగంలో జాతీయ అనువాద పురస్కారం పొందిన అవార్డు గ్రహీత, అనువాదకురాలు. కూడా కావడం గమనార్హం.

# హనుమాన్ నగర్ కాలనీలో శ్రీ సీతారాముల కళ్యాణం

**సదాశివపేట.మార్చి27. (సిరి న్యూస్) శుక్రవారం**



శ్రీ వీరాంజనేయ స్వామి హనుమాన్ నగర్ ఆలయ కమిటీ భక్త బృందం కాలనీ వాసులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.విజయ గణపతి నవగ్రహ శివ పంచాయతన సహిత శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం భక్తకోటి ఆదర్శంగా ధర్మస్థాపన కోసం అవతరించిన భగవాన్ శ్రీరాముని జన్మోత్సవాన్ని పురస్కరించుకొని మన అరవిల్లు పట్టణం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. చంద్రమాన శ్రీ పరాభవ నామ చైత్ర శు నవమి, పునర్వసు నక్షత్ర యుక్త మిథున లగ్న పుష్కరాంశ సుముహూర్తమున లక్ష్మీదేవి విష్ణుమూర్తి స్వరూపమైన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.కళ్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ వరలక్ష్మీ కోల్కూర్ ప్రవీణ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ నగర్ కాలనీలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పల్లకి సేవ నిర్వహించనున్నామన్నారు.

# సోలిస్ ఐ-కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ప్రారంభించిన ట్రాఫిక్ ఏ.సి.పి.కె.వెంకట్ రెడ్డి





- **సోలిస్ ఐ-కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ప్రారంభించిన ట్రాఫిక్ ఏ.సి.పి.కె.వెంకట్ రెడ్డి.**

**కొంపల్లి,మార్చ్-27(సిరి న్యూస్).**

ప్రజల దాహార్తిని తీర్చడమే తమ లక్ష్యం అని సోలిస్ ఐ కేర్ సంస్థ యాజమాన్యం అన్నారు.శ్రీరామ నవమిని పురస్కరించుకొని కొంపల్లి నాలుగవ బ్రాంచ్ సోలిస్ ఐ–కేర్ హాస్పిటల్ వారి నేతృత్వంలో సుచిత్ర కూడలి వద్ద మరియు కొంపల్లి కూడలి వద్ద చలివేంద్రాలను సంస్థ యాజమాన్యం కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ట్రాఫిక్ ఏ.సి.పి.కె. వెంకట్ రెడ్డి.స్థానిక ట్రాఫిక్ సి.ఐ.మ ధుసూదన్ పాల్గొని యజమాని రాము తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్య అతిధులుగా పాల్గొన్న వారిని సంస్థ యాజమాన్యం శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో తమ వంతుగా పేద ప్రజలకు సహాయాన్ని అందించే దృక్పథంతో చలివేంద్రలను ప్రారంభించామని ఇలాంటి సేవలు చేసుకునే ఆలోచన ప్రతి ఒక్కరికి ఉండాలని సూచించారు.స్థానికంగా సుచిత్ర మరియు కొంపల్లి పరిసర ప్రాంతాల్లోని చలివేంద్రాలను ప్రతిరోజు వివిధ రకాల( చెరుకు రసం,నిమ్మ రసం.బెల్లం తో చేసిన పచ్చడి లాంటివి సుమారు ఈ మూడు నెలలు ప్రజలకు ఈ రెండు చలివేంద్రాలలో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఐ–కేర్ హాస్పిటల్ నిర్వహించినటువంటి చలి వేంద్రను ప్రతి ఒక్కరు కూడా విని యోగించుకొని అంతే కాకుండా సంస్థ వారు ఏర్పాటు చేస్తున్నటువంటి ఫ్రీ హెల్త్ క్యాంప్స్ కానీ స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను కూడా స్థానికంగా ఉన్నటు వంటి కొంపల్లి సోలిస్ ఐ కేర్ హాస్పిటల్ వారు పేద ప్రజల కోసం నిర్మించిన హాస్పిటల్ అని కొని యాడారు.సంస్థ యాజమాన్యం మా ట్లాడుతూ సంస్థ నాలుగవ బ్రాంచ్ కావడం కొంపల్లిలోనూ ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని స్థా నికంగా సహక రిస్తున్న టువంటి అధికా రులకు మరియు స్థానిక ప్రజ లందరూ కూడా ప్రత్యేక ధన్యవా దాలు తెలియ జేసుకుంటూ శ్రీరామనవమి శుభా కాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో మేనేజింగ్ డైరెక్టర్ రామాం జనేయులు మరియు బ్రదర్స్,అరెకేపూడి ప్రసాద్, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, స్థానిక ట్రాఫిక్ సీఐ మధుసూదన్, హాస్పిటల్ జెనరల్ మేనేజర్ అనిల్ కుమార్,విజయేందర్ రెడ్డి సోలిస్ ఐ కేర్ డాక్టర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కంకోల్–మొగుడంపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి భక్తి సందడి

**మునిపల్లి మార్చ్ 27 (సిరి న్యూస్)**



మునిపల్లి మండల పరిధిలోని కంకోల్ మరియు మొగుడంపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఉల్లాసభరితంగా ఆటపాటలు, భక్తి సంగీతాల మధ్య పండుగను ఘనంగా జరుపుకున్నారు.శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు హనుమాన్ మందిరం వరకు ర్యాలీగా నడిచారు. భజనలు, జై శ్రీరామ్ నినాదాలతో గ్రామం అంతా భక్తిమయంగా మారింది.తదుపరి, కంకోల్ హనుమాన్ మందిర్ వద్ద పురోహితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల కల్యాణం సంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ఘనంగా జరుపుకున్నారు.

# విద్యుత్ ఘాతంతో గోధుమ పంట దగ్ధం

**నేరడిగొండ మార్చ్ 27 (సిరి న్యూస్)**



మండలంలోని తేజాపూర్ గ్రామంలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తీగల వెంకటరమణకు చెందిన పొలంలో సాగుచేసిన గోధుమ పంట విద్యుత్ ఘాతంతో మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. కోతకు సిద్ధంగా ఉన్న గోధుమ పంటపై ఆకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు వ్యాపించి పంట మొత్తం కాలిపోయింది. ఈ ప్రమాదంలో దాదాపు పది క్వింటాళ్ల గోధుమ పంట నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. నష్టపోయిన పంట విలువ సుమారు రూ.30 వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట కోతకు ముందే కాలిపోవడం తనకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని కంటతడి పెట్టాడు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

# గుమ్మడిదలలో మండలంలో సీతారాముల కళ్యాణోత్సవాలు






**గుమ్మడిదల, మార్చి 27 ( సిరి న్యూస్):**

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మండలం, పురపాలక సంఘం పరిధిలో సీతారాముల కళ్యాణోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ వేడుకలు గ్రామాలన్నింటిలోనూ పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. మండల పరిధిలోని నల్లవల్లి, కానుకుంట గ్రామాలతో పాటు పురపాలక సంఘం పరిధిలోని అన్నారం, బొంతపల్లి, దోమడుగు గ్రామాలలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల రాకపోకలు పెరిగి, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.కళ్యాణోత్సవ కార్యక్రమం సందర్భంగా పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీరాముడు, సీతమ్మవారికి వివాహ తంతును నిర్వహించగా, భక్తులు తిలకించి పరవశించారు. దేవాలయ ప్రాంగణాలు శ్రీరామ జయరామ నామస్మరణలతో మారుమోగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు సమృద్ధిగా ప్రసాదాలను అందజేశారు. గ్రామాలన్నింటిలోనూ సామూహిక భోజనాలు నిర్వహించి భక్తులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాలన్నింటిలోనూ భక్తి వాతావరణం నెలకొని, సీతారాముల దివ్య కళ్యాణాన్ని తిలకించిన భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# వైభవంగా రాములోరి కళ్యాణం



**వేంసూర్ మార్చ్ 27 (సిరి న్యూస్)**

మండలంలోని వెంకటాపురం గ్రామంలో గల ఆంజనేయ స్వామి దేవస్థానంలో సీతాదేవి సమేత శ్రీరాముల వారి కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పవిత్ర కళ్యాణ మహోత్సవాన్ని గొర్ల నరసింహారెడ్డి – మధురవాణి దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చణాల మధ్య సాంప్రదాయ పద్ధతిలో కళ్యాణ కార్యక్రమం కొనసాగింది. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# ప్రజాసేవకు అంకితమైన మహానేత సీఆర్ఆర్

**ఆదిలాబాద్,మార్చి 27( సిరి న్యూస్):**



దివంగత మాజీ మంత్రి చిలుకూరి రామచంద్ర రెడ్డి (సీఆర్ఆర్) ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సీఆర్ఆర్ జయంతి సంద ర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ చివరి శ్వాస వరకు ఆదిలాబాద్ ప్రజల అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకుడని కొనియాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా తన రాజకీయ ప్రస్థానంలో అనేక మంది నాయకులను తయారుచేసి క్రమశిక్షణ కలిగిన పార్టీ నాయకత్వాన్ని తీర్చిదిద్దిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన హయాంలో సాగునీటి ప్రాజెక్టులు, పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలులోకి వచ్చాయని గుర్తుచేశారు. సీఆర్ఆర్ మన మధ్య లేకపోయినా ఆయన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రతిఒక్కరు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి పరస్పరం తినిపిం చుకుంటూ మహానేత సేవలను స్మరిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ కౌన్సిలర్ అంబకంటి అశోక్, డీసీసీ కోశాధికారి అల్లూరి అభిషేక్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ధర్మపురి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, భూమా రెడ్డి, మల్లా రెడ్డి, భోజా రెడ్డి, దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, గుడిపెల్లి నగేష్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, శాంతన్ రావు, దీపక్ రావు, రూపేష్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రహీం ఖాన్, ఆలిమ్, ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు తాగునీటి సౌకర్యం

## హనుమాన్ దేవాలయం వద్ద బోర్వెల్ ప్రారంభం



**తాండూర్మార్చ్ 27 (సిరి న్యూస్)**

మండలంలోని రేపల్లెవాడ హనుమాన్ దేవాలయం వద్ద శుక్రవారం బోర్వెల్ను ప్రారంభించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంచిర్యాల డిసిసి ఉపాధ్యాయులు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్ ఈ బోర్వెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బోర్వెల్ ప్రారంభంతో దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రేపల్లెవాడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా సీతారాముల కళ్యాణ వేడుకలు





**తాండూర్( సిరి న్యూస్):**

మండలంలో శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సీతారాముల కళ్యాణ వేడుకలు వివిధ దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండల కేంద్రంలోని ఐబి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ పూజారి నవీన్ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా సాగింది. ఈ వేడుకలను భక్తులు కనులారా వీక్షించి భక్తి భావంలో మునిగిపోయారు. అలాగే మాదారం టౌన్షిప్‌లోని శ్రీ కోదండ రామాలయంలో, ద్వారకాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో, కొత్తపల్లి హనుమాన్ దేవాలయంలో, రేపల్లెవాడ హనుమాన్ దేవాలయంలో కూడా సీతారాముల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, భక్తులు, అంజన్న భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ భక్తుల శోభయాత్ర



**తాండూర్( సిరి న్యూస్):**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని తాండూర్ మండలంలో హనుమాన్ భక్తులు శోభయాత్ర నిర్వహించారు. శుక్రవారం తంగళ్లపల్లి హనుమాన్ దేవాలయం నుంచి మండల కేంద్రంలోని ఐబీ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం వరకు పల్లకి సేవతో ఈ శోభయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ శోభయాత్రలో భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. భక్తి భావంతో సాగిన ఈ ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. ఈ శోభయాత్రలో హనుమాన్ భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తాండూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమం సజావుగా జరిగేలా పర్యవేక్షించారు.

# కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం



**బెజ్జూర్( సిరి న్యూస్):**

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా జరిగిన ఈ వేడుకలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయాన్నే భక్తులు బాజభజంత్రీలతో పచ్చని పందిళ్లు ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామాల్లో భక్తి గీతాలు, నామస్మరణలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆయా గ్రామాల్లో సీతారాముల కళ్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు మంత్రోచ్చరణాల మధ్య కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తూ దాని విశిష్టతలను భక్తులకు వివరించారు. అనంతరం కళ్యాణానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీతారాముల నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగి, కోదండ రాముని వివాహాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.

# "విజయ వైడూర్యం" పుస్తక ఆవిష్కరణ

**నేరడిగొండ ( సిరి న్యూస్):**



శ్రీరామ నవమి సందర్భంగా నేరడిగొండ మండలం వడూర్ గ్రామంలో "విజయ వైడూర్యం" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ స్థానిక రచయిత, కవి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు బొందిడి పురుషోత్తమరావు రచించిన ఈ పుస్తకాన్ని గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, ఉప సర్పంచ్ ఎరెడ్ల మమత చంద్రశేఖర్, రచయితతో పాటు డాక్టర్ ముదోల్కర్ మల్లేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ వడూర్ (వైడూర్యపురం) చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని, నిర్మల్ రాజ్యంలో ప్రత్యేక స్థానం ఉన్న గ్రామమని తెలిపారు. వివిధ కులాలు, వృత్తుల ప్రజలు కలిసి నివసిస్తూ అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం రచయిత బొందిడి పురుషోత్తమరావు మాట్లాడుతూ స్వస్థలంపై ప్రేమతో గ్రామానికి పేరు తీసుకొచ్చిన వ్యక్తుల విజయ గాధలను భవిష్యత్తు తరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. గతంలో "వైడూర్యపుర వైభవం"లో 47 మంది గురించి ప్రస్తావించగా, "విజయ వైడూర్యం"లో 33 మంది ప్రముఖుల విజయాలను పొందుపర్చినట్లు తెలిపారు. ఈ గ్రంథాన్ని తన బాల్య మిత్రుడు, ప్రజాసేవకు అంకితమైన డాక్టర్ మల్లేశ్వర్లకు అంకితం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కాగా గ్రామ యువనేతలు సర్పంచ్ శ్రీకాంత్, ఉప సర్పంచ్ మమత చంద్రశేఖర్, చొక్కపెల్లి రాములు రచయితను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, వార్డ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతలోనే ప్రశాంతత

- **సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో ఎమ్మెల్సీ దండే విఠల్**

**బెజ్జూర్ (సిరి న్యూస్):**



ఆధ్యాత్మికతలోనే ప్రశాంతత లభిస్తుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శుక్రవారం బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణకుంభాలతో ఎమ్మెల్సీకి స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన ఆయన రాములవారికి తలంబ్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభివృద్ధి సంబంధిత సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ప్రభుత్వంతో చర్చించి గ్రామీణ ప్రాంతాల్లోని హిందూ సనాతన ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైన వేడుకగా పేర్కొన్నారు. ఇది ప్రేమ, ధర్మం, కుటుంబ బంధాలకు ప్రతీకగా శ్రీరామ నవమి రోజున జరుపుకుంటారని తెలిపారు. భద్రాచలం, రామతీర్థం వంటి ప్రసిద్ధ క్షేత్రాల్లో ఈ దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీరామచంద్రమూర్తి జీవిత గాధ మానవునికి మార్గదర్శకమని, ఆయన ఆచరణలు మనకు ఎన్నో పాఠాలు నేర్పుతాయని తెలిపారు. ప్రజాపాలనలో కూడా రామరాజ్యాన్ని తలపించేలా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి నిదర్శనం నర్మాల గ్రామం

- **హనుమాన్ దీక్షలో ఉన్న స్వాములకు ముస్లిం సోదరుల సేవాభావం**

**గంభీరావుపేట( సిరి న్యూస్):**



గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే హృద్యమైన సంఘటన చోటుచేసుకుంది. హనుమాన్ మాల ధరించి దీక్షలో ఉన్న స్వాములకు గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు సేవాభావంతో పాలు, పండ్లు పంపిణీ చేశారు. ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం యువకులు, పెద్దలు కలిసి స్వాములకు స్వయంగా పాలు, పండ్లు అందజేశారు. ఈ సేవను స్వీకరించిన స్వాములు ఆనందం వ్యక్తం చేస్తూ ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ షబ్బీర్ మాట్లాడుతూ "మనం అందరం ఒకే సమాజానికి చెందినవారమే. మతాలు వేరైనా మనసులు ఒక్కటే. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రేమ, ఐక్యతను పెంపొందించుకోవడం అవసరం" అని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ నర్మాల గ్రామం ఎప్పటి నుంచో మతసామరస్యానికి నిలయంగా ఉందని, హిందూ–ముస్లిం సోదరులు కలిసి పండుగలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, మత భేదాలు మనుషుల మధ్య విభేదాలకు కారణం కాకూడదనే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా చాటిందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో దుబ్బ హనుమాన్ దేవాలయం కమిటీ అధ్యక్షుడు రాజబోయిన అంజనేలు, ఉప సర్పంచ్ సుదర్శన్, కోశాధికారి మధు, సభ్యులు రాము, రాజు, నర్సింలు, కిషోర్, ముస్లిం సోదరులు మహమ్మద్ ఖాసీం, సమీర్, వసిఉల్లాహ్, జాహేద్, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్‌లో సీతారాముల శోభాయాత్ర

**జైనూర్( సిరి న్యూస్):**



శ్రీరామ నవమి సందర్భంగా జైనూర్ మండల కేంద్రంలో సీతారాముల శోభాయాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను తీసుకెళ్తూ ప్రధాన వీధుల గుండా శోభయాత్ర జరిపారు. భక్తులు జై శ్రీరామ్ నామస్మరణ నినాదాలతో మార్మోగించారు. అనంతరం హనుమాన్ మందిర్ ఆలయంలోని కళ్యాణ మండపంలో సీతారాముల కళ్యాణ వేడుకలను పురోహితులు కులకర్ణి పండిత్ మహారాజ్ చేతుల మీదుగా సంప్రదాయబద్ధంగా జరిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కడప ప్రకాష్, మాజీ సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాష్, విశ్వహిందూ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేపల కావలికి వెళ్లి మత్స్యకారుడు మృతి

**హత్నూర( సిరి న్యూస్):**



చేపల కావలికి వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన ఘటన హత్నూర మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామే సత్యనారాయణ(46) బుధవారం సాయంత్రం భోజనం అనంతరం చాకి చెరువుకు చేపల కావలికి వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. గురువారం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల వద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదు. శుక్రవారం తెల్లవారు జామున చాకి చెరువులో సత్య నారాయణ శవంగా తేలి కనిపించడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. మృతుడి భార్య సక్కుబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# క్రెడిట్ కార్డు వాడుతున్నారా..? అయితే జాగ్రత్త..!




ఈ మధ్య కాలంలో క్రెడిట్ కార్డుల వినియోగం పెరిగింది. చాలా మంది తమ ఆర్థిక అవసరాల్ని తీర్చుకునేందుకు క్రెడిట్ కార్డులు వినియోగిస్తున్నారు. అయితే.. క్రెడిట్ కార్డులు తీసుకునే ముందు.. ఫీజులు, ఇతర ఛార్జీల గురించి ముందుగా తెలుసుకోవాల్సి ఉంటుంది. అయితే మనకు తెలిసినవి కొన్ని ఉన్నప్పటికీ.. తెలియనివి చాలానే ఉంటాయని చెప్పొచ్చు. ముందుగా తెలుసుకోకపోతే నష్టపోవాల్సి వస్తుంది.

మన జీవితంలో అకస్మాత్తుగా అనేక ఆర్థిక అవసరాలు వస్తుంటాయి. అటువంటి అత్యవసర పరిస్థితుల్లో మన దగ్గర డబ్బులు ఉండకపోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో క్రెడిట్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రస్తుతం క్రెడిట్ కార్డులు నిత్యావసరంగా మారాయి. ఈ రోజుల్లో చెల్లింపులు చేయడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు క్రెడిట్ కార్డులను వినియోగిస్తున్నారు. అయితే క్రెడిట్ కార్డును సరైన పద్ధతిలో ఉపయోగించుకున్నట్లయితే అత్యవసర సమయాల్లో ఆర్థిక సాధనంగా ఉపయోగపడుతుంది. అనవసరమైన ఖర్చుల కోసం క్రెడిట్ కార్డును వాడితే అప్పుల ఊబిలోకి నెడుతుంది. క్రెడిట్ కార్డును జారీ చేసే సంస్థలు స్వాగత ప్రయోజనాలు అందించేటప్పుడు కొన్ని నిబంధనలు, షరతులను పెడతాయి. కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకున్నవారు చేసే అతి తీవ్రమైన తప్పులలో బకాయి ఉన్న కనీస మొత్తాన్ని మాత్రమే చెల్లించడం. క్రెడిట్ బిల్లు మొత్తం కట్టకుండా బకాయి ఉన్న కనీస మొత్తాన్ని చెల్లించడం వల్ల ఇబ్బందులు పడతారు. క్రెడిట్ కార్డు జారీ సంస్థలు ఫైనాన్స్ ఛార్జీలను విధిస్తాయి. దీంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదం ఉంది. మరోవైపు, కనీస బకాయి చెల్లింపును కూడా చెల్లించలేకపోతే ఫైనాన్స్ ఛార్జీలతో, ఆలస్య చెల్లింపు ఛార్జీలు కూడా పడతాయి. ఇది క్రెడిట్ స్కోర్ పై ప్రభావం చూపుతుంది. క్రెడిట్ కార్డుల్ని ఉపయోగించి ఖర్చు చేసి.. బిల్లు టైముకు కట్టకపోతే.. క్రెడిట్ స్కోరు కూడా తగ్గుతుంది. ఇది మ ఇతర లోన్లు రాకుండా అడ్డుపడుతుందని చెప్పొచ్చు. క్రెడిట్ కార్డుల్ని కొన్నింటిని తొలుత ఫ్రీగానే ఇస్తున్నప్పటికీ.. తర్వాత మళ్లీ ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంటుంది. ఏడాదికి కనీసం నిర్ణయించిన ప్రకారం.. ఖర్చు చేయకుంటే ఈ ఛార్జీలు వసూలు చేయొచ్చని చెబుతున్నారు.

# వృద్ధులకు ఆసరాగా ఓల్డేజ్ హోమ్స్



ద్ధులు చివరి దశలో సంతోషంగా, స్వేచ్ఛగా ఉండేందుకు ఓల్డేజ్ హోమ్ మంచి అనే చెప్పవచ్చు. ఈ రోజుల్లో ఇందులో చేరే వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ ంది. వివిధ కారణాలతో సీనియర్ సిటిజన్స్ చాలా మంది ఇందులో తున్నారు. ఇంట్లో గొడవలు, ఇతర సమస్యలు, బిజీ జీవితంలో వారిని ంచుకోవడం భారమై దీనిలో జాయిన్ చేస్తుంటారు. మరికొందరు విదేశాల్లో డటం వల్ల పెద్దవాళ్ల బాగోగులు చూసుకునేవాళ్లు లేక హోమ్స్‌లో చుతున్నారు. అలాగే కన్న పిల్లలతో పడక కొంత మంది తల్లీ దండ్రులు ంతటా వారే ఓల్డేజ్ హోంలో జాయిన్ అవున్నారు. నిజానికి ఓల్డేజ్ హోం అనేది ర్ధాప్యంలో మానసిక సంతోషాన్ని ఇస్తుందని పలువురు నిపుణులు టున్నారు.

ప్పుడు ఊర్లలో ఉదయాన్నే చెట్టుకింద కూర్చొని పెద్దవాళ్లంతా సరదాగా కబుర్లు ప్పుకునేవాళ్లు. పిల్లలకు, మనవలకు ఎప్పటికప్పుడు మంచి, చెడు చెప్పేటోళ్లు. ఉమ్మడి కుటుంబాలు ఉండేవి దానితో పెద్దవాళ్లను చూసుకునేందుకు కుదిరేది. ఇండ్లలో ఏ శుభకార్యమైనా వాళ్ల చేతుల మీదనే జరిగేది. కానీ ఇప్పుడున్న ఆ పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్ సిటిజన్ల అవసరాలకు తగ్గట్టు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఓల్డేజ్‌హోమ్స్,అడల్ట్ డే కేర్ సెంటర్లు వంటి ఎన్నో సదుపాయాలు ఉన్నాయి.

ఓల్డేజ్ హోంలో ఉన్న వృద్ధులు తమ పిల్లలకు భారమై ఇక్కడకు వచ్చామన్న భావనను ఒదిలి సంతోషంగా వారి జీవనం సాగిస్తున్నారంటా. ఎందుకంటే ఈ వయస్సులో కోరుకున్న జీవితం అక్కడే లభిస్తుందని పలువురు అంటున్నారు. పచ్చని ప్రదేశం, ఆరోగ్యానికి తగ్గట్టు పౌష్టికాహారం, డైలీ రొటిన్ చెకప్స్ , ఉదయాన్నే యోగా, ఎక్సర్ సైజ్ అంటూ వారికి రోజు గడవడానికి చాలా అక్టీవిటీస్ ఉంటాయి. మంచి తోడు, మాట్లాడేవాళ్ళు ఉండటం ద్వారా వారికి మానసిక ఉల్లాసం దొరుకుతుంది.

ఓల్డేజ్ హోమ్ అనే కాదు.. కొంచెం డబ్బులు ఉన్నవారు తమ తల్లీ దండ్రులను ఉంచడానికి డే కేర్ సెంటర్లు, సీనియర్ లివింగ్ లగ్జరీ అపార్ట్‌మెంట్స్ అందుబాటులో ఉన్నాయి. పిల్లల డే కేర్ సెంటర్లు చూశాం. అడల్ట్ డే కేర్ సెంటర్ ఉందని చాలా మందికి తెలిసి ఉండదు. ఇది కొత్తగా అందుబాటులోకి వచ్చింది. పని మీద పిల్లలు ఊరెల్లినప్పుడు ఇంట్లో ఉన్న పెద్దవాళ్లకు టైంకి భోజనం, మందులు ఇచ్చేవాళ్లు లేక ఇబ్బంది పడుతుంటారు. అలాంటి ఇబ్బంది లేకుండా ఈ అడల్ట్ డే కేర్ సెంటర్ ఉపయోగపడుతుంది. ఇక్కడ నర్స్ ఫెసిలిటీ ఉంటుంది. విదేశాలకు వెళ్లే పిల్లలు కూడా ఆరేడు నెలల పాటు కూడా తల్లిదండ్రులను ఇక్కడ ఉంచి వెళ్తుంటారు.

పెద్దవాళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడే వాళ్లకు హైజీన్ ఫుడ్ పెడుతుంటారు.

ఇప్పుడున్న కాలంలో ఓల్డేజ్ హోమ్‌లో తమ తల్లీదండ్రులను పెట్టారు అంటే వారిని సమాజం దూశిస్తూనే ఉంటుంది. కానీ అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే ఆ వయస్సులో వారికి ఏం కావాలో తెలుసుకోవాలి. వారికి మానసిక సంతోషాన్ని ఇచ్చే ప్రదేశాల్లోనే వారిని ఉంచడంలో తప్పేమీ లేదు.

# ఆ బాడీ ఏంట్రా బాబు, అస్సలు ఊహించ లేదు.. ఇది అసలైన బర్త్‌డే ట్రీట్ చరణ్ అన్న!

- ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు పెద్ది
- చరణ్ పుట్టినరోజు సందర్భంగా పెద్ది గ్లింప్స్
- ఇది అసలైన బర్త్‌డే ట్రీట్ చరణ్ అన్న

‘గ్లోబల్ స్టార్’ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా ‘పెద్ది’. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ.. పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. ఉత్తరాంధ్ర నేపథ్యంతో స్పోర్ట్స్ అండ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. నేడు రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా పెద్ది నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ‘పెద్ది పహిల్వాన్’ పేరుతో ఈ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది.

గ్లింప్స్ చూసిన అభిమానులు ‘ఇంత రేంజ్‌లో ఉంటుందని అస్సలు ఊహించలేదు’ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, స్క్రీన్ ప్రెజెన్స్ పీక్స్‌లో ఉన్నాయని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ‘ఆ బాడీ ఏంట్రా బాబు’, ‘చరణ్ అన్న.. చించేశావ్’, ‘ఇది అసలైన బర్త్‌డే ట్రీట్’ అంటూ ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు ఈ చిత్రంలో చరణ్‌ను పూర్తిగా కొత్త కోణంలో ప్రెజెంట్ చేస్తున్నట్లు గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. ఇప్పటి వరకు చూడని లుక్‌లో, మాస్ అండ్ రస్టిక్ టచ్‌తో చరణ్ కనిపించడం అభిమానుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ముఖ్యంగా కుస్తీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతున్న ఈ కథలో చెర్రీ చేసే విన్యాసాలు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి.

పెద్ది గ్లింప్స్‌లో కుస్తీకి ప్రాధాన్యం ఇచ్చిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ‘పెద్ది అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా.. పాణంతో సావుకు ఎదురెళ్లే ఆట’, ‘చూడమ్మే.. ఆటే నా పొగరు’ అనే డైలాగ్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా మల్లయోధుడిగా రామ్ చరణ్ అదరగొట్టారు. ఆయన లుక్, బాడీ లాంగ్వేజ్, పోరాట సన్నివేశాలు.. అన్ని కలిపి సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ఈ గ్లింప్స్ చూసిన తర్వాత వెండి తెరపై ‘పెద్ది’ విన్యాసాలు ఎప్పుడు చూస్తామా అనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది. మొత్తానికి పెద్ది గ్లింప్స్ అసలైన బర్త్‌డే ట్రీట్ అనే చెప్పాలి. పాటల మాదిరి.. గ్లింప్స్ కూడా రికార్డులు కొల్లగొట్టడం ఖాయం.





# పెళ్లి అప్పుడే.. చెప్పేసిన సాయి పల్లవి

గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో హీరోయిన్ సాయి పల్లవి పెళ్లి గురించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలకు ఆమె స్వయంగా చెక్ పెట్టారు, తాజాగా తన పెళ్లిపై వస్తున్న వార్తలపై స్పందించారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమెకు, జర్నలిస్టుల నుంచి పెళ్లికి సంబంధించిన ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనికి ఆమె ఎంతో హుందాగా, స్పష్టంగా సమాధానమిచ్చారు. తన పెళ్లి గురించి వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని సాయి పల్లవి తేల్చి చెప్పారు. “ప్రస్తుతానికి నా ఆలోచనలన్నీ కేవలం నా కెరీర్ పైనే ఉన్నాయి. పెళ్లి గురించి ఇప్పట్లో ఆలోచించే ప్రసక్తే లేదు. నేను ప్రస్తుతం పూర్తిగా సింగిల్ అని” ఆమె తెలిపారు. దీంతో గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఒక్కసారిగా బ్రేక్ పడింది.

సాయి పల్లవి ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో తీరిక లేకుండా గడుపుతున్నారు. ముఖ్యంగా హిందీ చిత్రసీమలో ఆమె అడుగుపెట్టబోతుండటం విశేషం. ‘ఏక్ దిన్’ అనే సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకులను పలకరించేందుకు ఆమె సిద్ధమవుతున్నారు. ఈ భారీ ప్రాజెక్టులతో పాటు మరికొన్ని సౌత్ సినిమాల్లోనూ ఆమె కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిజాయితీకి, సహజత్వానికి మారుపేరుగా నిలిచే సాయి పల్లవి, తన పెళ్లి విషయంలో కూడా అంతే పారదర్శకంగా స్పందించి అభిమానుల సందేహాలను పటాపంచలు చేశారు.



# బ్లాక్‌బస్టర్ల కాంబో.. రిపీట్ అవుతున్న మ్యాజిక్!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సంక్రాంతి పండగ అంటేనే పెద్ద సినిమాల జాతర, ముఖ్యంగా ‘విక్టరీ’ వెంకటేష్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ అంటే ప్రేక్షకుల్లో ఉండే అంచనాలే వేరు. ఇప్పుడు ఈ క్రేజీ కాంబోకు నందమూరి వారసుడు కళ్యాణ్ రామ్ తోడైతే? అవును.. ఊహించని రీతిలో టాలీవుడ్‌లో ఒక భారీ మల్టీ స్టారర్ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వెంకటేష్ - అనిల్ రావిపూడిల మధ్య ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ‘F2’, ‘F3’ వంటి హిట్‌లతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఉర్రూతలూగించిన వీరిద్దరూ, ఇప్పుడు ఐదోసారి జతకడుతున్నారు. ఇటీవలే ‘MSG’లో అతిథి పాత్రతో మెరిసిన వెంకటేష్, పూర్తిస్థాయి వినోదాత్మక పాత్రలో కనిపించనున్నారు. మరోవైపు, ‘పటాస్’ వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో కళ్యాణ్ రామ్ నటిస్తున్న రెండో చిత్రం ఇది. ఈ ఇద్దరు స్టార్ హీరోల కలయిక సినిమాపై అప్పుడే భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది.

‘భగవంత్ కేసరి’, MSG’లో వంటి మాస్ బ్లాక్‌బస్టర్‌ను అందించిన ‘షైన్ స్క్రీన్స్’ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. దర్శకుడు అనిల్ రావిపూడితో ఈ సంస్థకు ఇది వరుసగా మూడో సినిమా కావడం గమనార్హం. ఈ భారీ ప్రాజెక్ట్‌కు సురేష్ ప్రొడక్షన్స్ మరియు శ్రీమతి అర్చన సమర్పకులుగా వ్యవహరిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ ‘జీ స్టూడియోస్’ సహనిర్మాతగా చేతులు కలిపింది. ఇంతటి భారీ నిర్మాతలు వెనకుండటంతో, టెక్నికల్ పరంగా కూడా సినిమా టాప్ నాచ్‌గా ఉండబోతోంది. అనిల్ రావిపూడి మార్కు హాస్యం, కుటుంబ అనుబంధాలు, పండగ వాతావరణం మేళవింపుతో ఈ కథ ఉండబోతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా క్లీన్ ఎంటర్‌టైనర్‌గా స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే గ్రాండ్ పూజా కార్యక్రమంతో సినిమాను ప్రారంభించి, టైటిల్‌తో పాటు ఇతర నటీనటుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు. నందమూరి - దగ్గుబాటి హీరోల ఈ సెన్సేషనల్ కాంబో, 2027 సంక్రాంతి రేసులో సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పాపం అనన్య పాండే.. అమ్మడిని ఆదుకునేది అతడేనా?

- అనన్య పాండేకు ధర్మ ప్రొడక్షన్స్ స్ట్రాంగ్ సపోర్ట్
- వరుసగా సినిమాలు తెరకెక్కిస్తోన్న కరణ్ జోహార్
- ధర్మలో వస్తున్న చాంద్ మేరా దిల్, కాల్ మీ బే2

బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే కెరీర్ చాలా డల్‌గా సాగుతోంది. హిట్ చూసి మూడేళ్లు దాటుతోంది. ‘డ్రీమ్ గర్ల్ 2’ తర్వాత సక్సెస్ ఎలా ఉంటుందో ఆమెకు తెలియదు. ‘స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2’తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అనన్య.. ‘పతి పత్ని ఔర్ ఓ’తో సెకండ్ హిట్ చూసింది. అయితే అమ్మడి హ్యాట్రిక్ హిట్టుకు విజయ్ దేవకొండ ‘లైగర్’ బ్రేకులేసింది. టాలీవుడ్ ఎంట్రీలో బిట్టర్ రిజల్ట్ చూసింది. ఇక చేసేదేం లేక బాలీవుడ్ చెక్కేసింది అనన్య.

అనన్య పాండే నటించిన సినిమాలు థియేటరల్లో కన్నా.. ఓటీటీలో ఎక్కువ ప్రత్యక్షమయ్యాయి. దీంతో ఆమెకు పెద్దగా పేరు, క్రెడిట్ దక్కలేదు. ఇక డిజిటల్ ఫ్లాట్ ఫామ్ వదిలి.. థియేటర్‌పై ప్రత్యక్షమౌతున్నా ఆడియన్స్ రిసీవ్ చేసుకోవడం లేదు. 2025లో ‘కేసరి చాప్టర్ 2’లో డీ గ్లామర్ రోల్ చేసినా.. ‘తుమేరీ మేతేరా’లో గ్లామర్ డోస్ పెంచినా సక్సెస్ మాత్రం దరిచేరలేదు. బీటౌన్‌లో ఫేడవుట్ దశకు చేరుకుంటోంది అనుకుంటోన్న టైంలో మళ్లీ ఆమెను ధర్మ ప్రొడక్షన్సే ఆదుకుంటోంది.

స్టార్ కిడ్స్‌తో సినిమాలు నిర్మించే కరణ్ జోహార్.. జాన్వీని పోషిస్తున్నట్లే, అనన్యకు మద్దతుగా నిలుస్తున్నాడు. గత ఏడాది ఇదే ప్రొడక్షన్ హౌస్‌లో వచ్చిన టూ ఫిల్మ్స్ బెడిసికొట్టినా.. మరో టూ ఆఫర్స్ ఇస్తున్నాడు ఈ ప్రొడ్యూసర్. లక్ష్య హీరోగా తెరకెక్కుతోన్న చాంద్ మేరా దిల్, కాల్ మీ బే 2 సిరీస్ నిర్మిస్తోంది ధర్మ. చాంద్ మేరా దిల్ ఏప్రిల్ 10న విడుదల కావాల్సి ఉండగా.. మే 22కి వాయిదా వేసుకుంది. ఇక కాల్ మీ బే2 త్వరలో ఓటీటీలోకి రాబోతోంది. మరి ఈ ఏడాదైనా అనన్య సక్సెస్ బాట పడుతుందా?, ధర్మ ప్రొడక్షన్ హౌస్ ఆమెకు హిట్టిస్తుందా? అనేది చూడాలి.



Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.